క్లుప్తంగా

నేడు నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని, సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

ఇంజనీరింగ్ కోర్ గ్రూపులపై అవగాహన



టెక్ మహీంద్రకు చెందిన వివేకానందను సన్మానిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యలో కోర్ గ్రూపులైన మెకానికల్, ఈసీఈ బ్రాంచ్‌ల ఆవశ్యకత పై గురువారం అవగాహన సదస్సును ఆయా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించారు. టెక్ మహీంద్ర కంపెనీ ఇంజనీరింగ్ విభాగాధిపతి చల్లా వివేకానంద విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల యాజమాన్యం వివేకానందను సత్కరించింది. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, రాంబాబు, రాహుల్, ఈసీఈ విభాగాధిపతి బీఎస్ రావు, చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన



సిద్ధాంతంలో కూచిపూడి నృత్యాలు చేస్తున్న దృశ్యం

పెనుగొండ: మహా శివరాత్రి సందర్భంగా సిద్ధాంతం శాలిపేటలో వీరభద్ర స్వామి వారి ప్రభల ఉత్సవంలో ఏర్పాటు చేసిన జాన పద, భరతనాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గురువారం రాత్రి శ్రీనివాస కళ్యాణం, గోపిక బృందావనం నృత్యం, రావణాష్టకం తదితర ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతో అలరించాయి. ఇక్కడ ప్రదర్శనలు ఇచ్చిన వారు చెన్నై, బెంగళూరు, హర్యానా, ఢిల్లీ ఏపీ భవన్‌లో కూడా ప్రదర్శనలు ఇచ్చారని నిర్వాహకులు తెలిపారు.

ముక్తేశ్వరుడి సన్నిధిలో అఖండ అన్న సమారాధన

పాలకోడేరు: స్థానిక మోగల్లు రోడ్డు సుబ్రహ్మణ్యపురం పంతొట్టి శివాలయంలో మహాశివ రాత్రి వేడుకలు పురస్కరించుకుని గురువారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పరిసర గ్రామ ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటితో ఈ కేవైసీ ప్రక్రియ ముగింపు

అత్తిలి: దాళ్వా ఈపంట నమోదుకు సంబంధించి ఈ కేవైసీ ప్రక్రియ నేటితో ముగుస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ గురువారం తెలిపారు. ఈ కేవైసీ చేయించుకోని రైతులు సమీప రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్ వద్ద ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ పంటలో ఈ కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ధాన్యం అమ్మటం, పంట నష్ట పరిహారం, సున్నావడ్డీ, పంటల బీమా వర్తిస్తుందని చెప్పారు.

కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక వర్గం సమర శీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ పిలుపునిచ్చారు. ఎఫ్‌టీయూ రాష్ట్ర స్థాయి విలీన సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ గురువారం పట్టణంలో నిర్వహించారు. దానవరప్రసాద్ మాట్లాడుతూ 2013లో కొన్ని కారణాలు వల్ల ఐఎఫ్‌టీయూ రెండుగా చీలిపోయిందని తెలిపారు. రెండు జాతీయ కమిటీలు చర్చలు జరిపినట్లు చెప్పారు. ఒకే ఐఎఫ్‌టీయూగా రూపుదిద్దుకోవడానికి మార్చి 2వ తేదీన రాజమండ్రిలోని పుష్కరాలు రేవు వద్ద చందా సత్రంలో సభ జరుగుతుందని, సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారని, సభను జయప్రదం చేయాలని కోరారు.

వాక్యజ్యోతి పోస్టర్ల ఆవిష్కరణ

పెంటపాడు: మార్చి 5,6 తేదీల్లో జట్లపాలెం గ్రామంలో వాక్యజ్యోతి చర్చి ఆధ్వర్యంలో సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమావేశాలకు సంబంధించి పడాల చర్చిలో గురువారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చర్చిసంఘ సభ్యులు, సేవకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సమావేశాలను పరిసర గ్రామాల భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిధులున్నా.. నిర్మించరా?



మున్సిపల్ ఓపెన్‌ఎయిర్ థియేటర్ (ఫైల్)



ఓపెన్ ఆడిటోరియం పనులు నిలిచిపోయిన దృశ్యం

- మధ్యలోనే ఆగిపోయిన మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం పనులు
- నిధులుండి కూడా పనులు చేయించని కూటమి సర్కార్

నరసాపురం: సాధారణంగా ఏ ప్రభుత్వ పని అయినా నిధులు సిద్ధంగా ఉంటే వేగంగా పనులు చేయించి ఆ ఫలాలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటూ ఉంటారు. అయితే నరసాపురం నియోజకవర్గంలో కూటమి నాయకులు తీరు ఇందుకు భిన్నంగా ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నరసాపురం నియోజకవర్గంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులకు బీజం పడింది. పక్కా జీఓలతో నిధులు మంజూరు చేసి అనేక భారీ ప్రాజెక్ట్‌లకు అప్పటి ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు శ్రీకారం చుట్టారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత ప్రాజెక్ట్‌లు ఒక్కొక్కటిగా అటకెక్కుతున్నాయి. మున్సిపల్ కార్యాలయం పక్కన విలువైన స్థలంలో నిరుపయోగంగా ఉన్న మునిసిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఓపెన్ ఆడిటోరియంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించి ఆ మేరకు పనులు ప్రారంభించారు. మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానంలో రూ 3.50 కోట్లతో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణాన్ని 2023 డిసెంబర్‌లో ప్రారంభించారు. ఈ ఓపెన్ ఆడిటోరియం పనులు పూర్తయితే నరసాపురంలో తక్కువ అద్దె ఖర్చుతో పంక్షన్ హాల్ అందుబాటులోకి రావడమే కాకుండా మున్సిపాలిటీకి కూడా ఆదాయం పెరుగుతుందని భావించారు. ఈ ఓపెన్ ఆడిటోరియం పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యి, పనులు చివరి దశలో ఉండగా ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణం విషయమే కూటమి నాయకులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం మారిన తరువాత పెండింగ్ పనులు అలాగే వదిలేశారు.

కల్యాణ మండపం అందుబాటులో లేక ఇబ్బందులు

మధ్యతరగతి ప్రజలు పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్స్ చేసుకోవడానికి తక్కువ ధరలో లభించే కల్యాణ మండపం నరసాపురం నియోజకవర్గ ప్రాంతంలో ఎక్కడాలేదు. ప్రైవేట్ ఫంక్షన్స్ హాల్స్‌కు లక్షల్లో అద్దెలు చెల్లించలేని పరిస్థితి. సీజన్ సమయాల్లో అయితే పంక్షన్స్ హాల్స్ దొరకడమే గగనంగా మారింది. దీనిని దృష్టిలో పెట్టుకుని నామమాత్రపు అద్దెతో కళ్యాణ మండపాన్ని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసింది. అటు మధ్య తరగతివారికి భారం తగ్గడం, ఇటు నిరుపయోగంగా ఉన్న ఓపెన్ ఎయిర్ థియేటర్ ద్వారా మున్సిపాలిటీకి కొంత ఆదాయం వస్తుందని మంచి ఆలోచనతో ఓపెన్ ఆడిటోరియం నిర్మాణాన్ని ప్రారంభించారు.

శాసన మండలిలో ప్రస్తావించినా..

గత శాసనమండలి సమావేశాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ వంక రవీంద్ర నిధులు అందుబాటులో ఉన్నా నిలిచిపోయిన ఓపెన్ ఆడిటోరియం పనులు ప్రారంభించాలని మండలిలో ప్రశ్నించారు. ఆడిటోరియం ఆవశ్యకతను సభలో కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అయినా కూడా ప్రభుత్వంలో చలనంలేదు. ఈ అంశంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఓపెన్ ఆడిటోరియం పెండింగ్ పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అన్ని ప్రాజెక్ట్‌లూ నిలిపేస్తున్నారు



వైఎస్సార్ సీపీ ప్రభుత గత ఐదేళ్లలో నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అనేక ప్రాజెక్టులు మంజూరు చేసింది. నిధులను కూడా అందుబాటులో ఉంచింది. అయితే అన్ని ప్రాజెక్ట్‌లను కూటమి ప్రభుత్వం మూలన పెట్టేస్తుంది. నిరుపయోగంగా ఉన్న ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఓపెన్ ఆడిటోరియంగా అభివృద్ధి చేసే పనులు మా ప్రభుత్వ హయాంలో శరవేగంగా సాగాయి. పనులు చివరిదశకు వచ్చిన తరువాత నిలిపేశారు.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

3 నుంచి డీఎన్నార్ కళాశాలలో శారీస్ స్క్రీన్ ప్రింటింగ్ కోచింగ్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని దాసరి నారాయణ రావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉచిత శారీస్ స్క్రీన్ ప్రింటింగ్ డిజైనింగ్ కోచింగ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు జ్యోతి గురువారం విలేకరులకు తెలిపారు. ఐక్యూఏసీ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో మహిళల కోసం ఈ కోచింగ్ ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 3, 4 తేదీల్లో రెండు రోజులు పాటు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ కోచింగ్ ఉంటుందన్నారు. ఈ కోర్సు నేర్చుకోవడానికి ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదని, కోర్సు నేర్చుకోవడానికి వచ్చే మహిళలు డార్క్ అండ్ లైట్ కలర్ క్లాత్‌లు తెచ్చుకోవాలని సూచించారు. నేర్చుకోవడానికి అవసరమైన మెటీరియల్ తామే అందిస్తామని మెటీరియల్ కోసం రూ.300 చెల్లించాలని స్పష్టం చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు, అలంపురం, కోరిమిల్లి గ్రామాల్లో గురువారం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. ప్రత్తిపాడు గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయభాను ఆధ్వర్యంలో ఘనంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలంపురంలో సాయిబాబా ఆలయంలో కొలనువాడ పెదకృష్ణంరాజు ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

నరసాపురం: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి గురువారం జరిగిన పోలింగ్ ప్రక్రియ నరసాపురంలో ప్రశాంతంగా ముగిసింది. నరసాపురం మండలానికి సంబంధించి మున్సిపాలిటీ, రూరల్ మండలంలో మొత్తం 5493 మంది ఓటర్లు ఉండగా 3,694 మంది ఓటు హక్కు వనియోగించుకున్నారు. పట్టణ పరిధిలోని ఓటర్లకు టేలర్‌హైస్కూల్‌లో 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రూరల్ మండలానికి సంబంధించి స్టీమర్‌రోడ్డు మున్సిపల్ స్కూల్‌లో 2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.

మొగల్తూరులో

మొగల్తూరు మండలంలో మొత్తం 1745 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా 1187 ఓట్లు పోలయ్యాయి. మొగల్తూరు హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని తహసీల్దార్ డి.రాజకిషోర్ తెలిపారు.

యలమంచిలిలో

యలమంచిలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యలమంచిలిలో 75 శాతం ఓట్లు పోలయినట్లు తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ, నెంబర్ వన్ పాఠశాలలో జరిగిన పోలింగ్‌లో పురుషులు 1614 మందికి గాను 1108 మంది, మహిళలు 1108 మందికి గాను 800 మంది మొత్తం 2722 మందికి గాను 2033 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా మొత్తం 74.69 శాతం ఓట్లు పోలయ్యాయని ఆయన వివరించారు.



నరసాపురం: టేలర్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఓట్లు వేయడానికి బారులు తీరిన పట్టభద్రులు



పోడూరు: పోలింగ్ కేంద్రాన్ని, స్టేషన్‌ను పరిశీలిస్తున్న నరసాపురం ఆర్డీఓ దాసి రాజు



పెనుమంట్ర: పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ భీమారావు

పోడూరులో..

పోడూరు: మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా సాగింది. పోడూరులో ఏర్పాటు చేసిన 3 పోలింగ్ స్టేషన్‌లలో మొత్తం 2363 ఓట్లు ఉండగా 1694 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 71.69 పోలింగ్‌శాతం నమోదైనట్లు తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ తెలిపారు. నరసాపురం ఆర్డీఓ దాసిరాజు పోడూరులో పర్యటించి పోలింగ్ తీరును పరిశీలించారు.

ఆచంటలో..

పెనుగొండ: ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలు గురువారం ఆచంట, పెనుగొండ మండలాల్లో ప్రశాంతంగా జరిగాయి. ఆచంట మండలంలో 1894 ఓట్లుకు గానూ 1337 ఓట్లు పోలయ్యాయి. 70.59 శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు జి కనకరాజు ఎప్పటికపుడు పర్యవేక్షించారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ గ్రామాల్లో పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

పెనుగొండలో..

పెనుగొండ మండలంలో మూడు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. 411 నంబరు పోలింగ్ కేంద్రంలో 434 మంది పురుషులకు గానూ 337 మంది, 407 మంది మహిళలకు గానూ 296 మంది మహిళలు, 412 పోలింగ్ కేంద్రంలో 487 మంది పురుషులకు గానూ 346 మంది, 360 మంది మహిళలకు గానూ 253 మంది , 413 పోలింగ్ కేంద్రంలో 489 మంది పురుషులకు గానూ 353 మంది, 346 మంది మహిళలకు గానూ 237 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 72.22 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దారు జి.అనితకుమారి తెలిపారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలలో 72.57 శాతం ఓట్లు పోలయ్యాయని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై రవికుమార్ తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలలో 2133 మమంది ఓటర్లకుగాను పోలింగ్ ముగిసే సమయానికి 1548 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జ్లాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్ రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ భీమారావు, నరసాపురం ఆర్డీవో దాసిరాజు పెనుమంట్రలో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల గేట్లను నిర్ణీత సమయానికే మూసివేయడంతో దూర ప్రాంతాలనుండి నిమిషాల వ్యవధిలో ఆలస్యంగా వచ్చిన పలువురు పట్టభద్రులను అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి 409 నంబర్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పాలకొల్లు పట్టణంలో మూడు పోలింగ్ కేంద్రాల్లో పది బూత్‌లను ఏర్పాటు చేశారు. ఎంఎంకేఎస్‌ఎం ఉన్నత పాఠశాలలో నాలుగు, బీఆర్‌ఎంవీ ఉన్నత పాఠశాలలో నాలుగు, ఏవీఎస్‌ఎస్‌ఎం ఉన్నత పాఠశాలలో రెండు బూత్‌లను ఏర్పాటు చేశారు. పాలకొల్లు పట్టణం, మండలంలో మొత్తం 7957 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా వారిలో 5710 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 71.76శాతం ఓట్లు పోలయ్యాయి. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఎంఎంకెఎస్‌ఎం పాఠశాలలో 429వ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధాన రహదారులపైనే శిబిరాలు ఏర్పాటుచేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పట్టణ 1 ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం శుక్రవారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ కె.మధు కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణ పరిధిలోని వరధనం రోడ్డు, మెయిన్‌రోడ్డు, శంభుని పేట, పెదగోపురం, పోస్ట్‌ఆఫీసు ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని స్పష్టం చేశారు.

కోడి పందేల శిబిరంపై దాడి

యలమంచిలి: స్థానిక పల్లిపాలెంలో కోడి పందేలు వేస్తున్నారనే సమాచారంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను గురువారం అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3070 నగదు, ఒక కోడి, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు

ఆకివీడు: మహాశివరాత్రి సందర్భంగా పలు శివాలయాల్లో గురువారం పూర్ణాహుతి, త్రిశూల స్నానం, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రాజ రాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరిగిన రుద్ర హోమం పూర్ణాహుతితో గురువారం ముగిసింది. మధ్యాహ్నం త్రిశూల స్నానం, రాత్రి స్వామి వారి ఏకాంత సేవలు ముగిశాయి. సిద్ధాపురం గ్రామంలోని రామ లింగేశ్వరస్వామి ఆలయంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వెంకట లింగేశ్వరస్వామి ఆలయంలో త్రిశూల స్నానం, పవళింపు సేవలు నిర్వహించారు. శుక్రవారం అఖండ అన్న సమారాధన జరుగనుందని ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య రవి చెప్పారు.

ఒత్తిడిని జయిస్తే విజయం సులభం

పెనుగొండ: ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుడదని, ఒత్తిడిని జయించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే విజయం సాధించవచ్చని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. ఏకాగ్రతతో ఒత్తిడి జయిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చని వివరిస్తున్నారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు మానసిక వైద్య నిపుణులు ఇచ్చే సూచనలు, సలహాలు ఇవే

- కొత్త అంశాలు నేర్చుకోవడానికి బదులు ఎంత శాతం పూర్తి చేశాం? ఎంత ఎఫెక్టివ్‌గా జ్ఞాపకం ఉంచుకున్నామన్న దానిపైనే దృష్టి పెట్టాలి.
- ఒత్తిడి పెరుగుతున్నట్లు అనిపించినా, ఏకాగ్రత నిలవడం లేదనిపించినా వెంటనే చదువుకు కాసేపు విరామమివ్వాలి. అదే పనిగా ఒత్తిడితో చదివినా జ్ఞాపకం ఉంచుకోవడం కష్టం.
- రివిజన్ అంటే చదువుకుంటూ పోవడం కాదు. ఒకే విషయం నుంచి మొత్తం గ్రహించడం అని గుర్తించాలి. ఎక్కువ మార్కులు పొందగలిగే ప్రశ్నలకు ఎక్కువ సమయం కేటాయించుకోవడం ఉత్తమం.
- పరీక్షలకు ముందు రోజు రివిజన్ అంశాలను నిర్ణయించుకోవాలి. కొత్తవాటి పై దృష్టి పెట్టవద్దు. ఎస్సై, షార్ట్ ప్రశ్నలకు మల్టీపుల్ చాయిస్ ఆధారంగా ప్రణాళిక చేసుకోవాలి.
- ఫార్ములాలు, సాంకేతిక పదాలను ప్రాక్టీస్ చేసి గుర్తుంచుకోవాలి. తేదీలు, సంఖ్యలు క్లుప్తంగా రాసుకొని రివిజన్ చేసుకోవాలి.
- రివిజన్ చేసేటపుడు పరీక్ష హాల్లో ఉండి చేస్తున్నట్లు ఊహించడం వల్ల పరీక్షల ఒత్తిడి అదుపులో పెట్టుకోవచ్చు.
- పరీక్షా సమయంలో రాత్రుళ్లు సరిగా నిద్రపోకుండా లైన్ టు లైన్ రివిజన్ మంచిది కాదు. ముఖ్యాంశాలు రివిజన్ చేస్తే మొత్తం చాప్టర్‌పై పట్టు సాధించవచ్చు.
- స్వతహాగా ఊహించి జవాబు రాయగలను అన్న ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలి. రాత్రి ముఖ్యాంశాలు చదివి పడుకొని, తెల్లారి లేచిన తరువాత మళ్లీ రివిజన్ చేసుకునే విధంగా ప్రణాళిక వేసుకోవాలి.
- చూసినది, చదివినది ఇన్‌పుట్ అనుకొంటే రాసేది, ఆలోచించేది, చెప్పేది అవుట్‌పుట్ అన్ని గ్రహించాలి. అనుకున్న విధంగా రివిజన్ పూర్తి చేస్తే మనసుకు సంతోషం కలుగుతుంది. ఇలా చేస్తే బాగా నిద్రపట్టి ఆత్మవిశ్వాసం కలుగుతుంది.
- చేతి రాత ఒకే స్పీడులో సమాన స్ట్రోక్స్ ఇస్తూ మనసు పెట్టి రాయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్య ధోరణితో రాయకూడదు. రాత శైలితో పాటు సరైన మార్జిన్లు, ప్రశ్నల నంబర్లు, జవాబుల మధ్య స్పష్టమైన గుర్తింపు ఉండేటట్లు చూసుకోవాలి. ఆందోళనతో రాయడం వల్ల అక్షరాలు అసంపూర్తిగానూ, గజిబిజిగా మనకే అర్థంకాని రీతిలో ఉంటాయి.
- పరీక్షా కాలంలో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరిగా తీసుకోవాలి. కాఫీ, టీలు అధికంగా తీసుకోకూడదు. పరీక్షకు వెళ్లే ముందు అరటి పండు, యాపిల్ తీసుకోవడం వల్ల పొటాషియం అంది మెదడు చురుగ్గా ఉంటుంది. పరీక్షలు, చదువుకు కావాల్సిన వస్తువులు ఒకే చోట ఉంచుకోవాలి. దీని వల్ల సమయం కలిసి వస్తుంది. ఆందోళన తగ్గుతుంది. కొత్త పెన్నులు, కొత్త బట్టలు అసౌకర్యాన్ని కలగజేస్తాయి. అలవాటు పడిన వాటి వలన ఏకాగ్రత పెరుగుతుంది.
- పరీక్షకు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. ఆందోళనతోనూ, హడావుడిగా వెళ్లడం వల్ల చదివినది మరచిపోయే ప్రమాదం ఉంది. ఆఖరి నిమిషం వరకూ చదువుతూ ఉండకూడదు.
- పరీక్షకు గంట ముందు నుంచి మౌనంగా ఉండి ప్రాక్టీసు చేసుకోవాలి. ప్రశ్నాపత్రం కంగారుగా చదివి జవాబు రాస్తే ఒకదాని జవాబు వేరొక దానికి రాసే ప్రమాదం ఉంది.
- కష్టమైన అంశాల గురించి స్నేహితులు చెప్పే ప్రగల్భాలను, పుకార్లను విని ఫలితాలపై ఆపాదించుకోకూడదు. వాటి ప్రభావం నుంచి బయట పడి పరీక్షలకు సిద్ధం కావడం ద్వారా మంచి విజయం సాధించవచ్చు.



పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న పెనుగొండ గురుకుల పాఠశాల విద్యార్థులు

ఏకాగ్రతతో ఒత్తిడిని జయించాలి



నిపుణులు తెలిపిన ఎగ్జామ్ టిప్స్ పాటిస్తే ఒత్తిడికి దూరం కావచ్చు. ఏకాగ్రతతో విద్యార్థులు ఒత్తిడిని జయించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళనకు గురి కాకపోతే మంచి ఫలితాలు సాధించవచ్చు.

ఆక్కింశెట్టి రాంబాబు, సైకాలజిస్ట్

రాళ్లచెరువుకు మోక్షం కల్పించాలి

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు రోడ్‌లోని ఎమ్మార్వో ఆఫీస్ సమీపంలో ఉన్న రజకుల రాళ్లచెరువుకు మోక్షం కల్పించాలని ఆ రజక సంఘం మండల అధ్యక్షులు భీమవరపు మహంకాళి మొరపెట్టుకున్నారు. గురువారం రాళ్లచెరువుకు ఉన్న ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెరువులోకి నీరు వచ్చే అవకాశం లేదని చెరువులోని మురుగునీరు బయటకు వెళ్లే మార్గం పూడుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు మార్గాలూ ఆక్రమణలకు గురై నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో చెరువులో నీరు పూర్తిగా కలుషితమై బట్టలు ఉతికేందుకు ఉపయోగకరంగా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి రజకులకు కేటాయించిన రాళ్లచెరువుకు అవుట్‌లెట్, ఇన్‌లెట్ మరమ్మతులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అక్రమంగా మద్యం నిల్వ చేసిన నలుగురి అరెస్ట్

నరసాపురం: సుంకం చెల్లించని మద్యం బాటిళ్లు నిల్వ చేసి ఉండటం, అంతేకాకుండా అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారన్న నేరంపై నలుగురిని అరెస్ట్ చేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్(ఏలూరు) కేవీఎస్ ప్రభుకుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు సీఐఎస్ రాంబాబు, సిబ్బందితో కలసి దాడి చేయగా కొప్పర్రులోని చెరువు వద్ద 86 అట్టపెట్టెల్లో ఉంచిన 4,125 మద్యం బాటిళ్లు లభించాయని చెప్పారు. ఈ కేసులో బి.జయరాజు, గొల్లమండుల రాజబాబు, కత్తిమండ జయబాబు, దిడ్ల రామకృష్ణలను అరెస్ట్ చేశామన్నారు. యానాం ప్రాంతానికి చెందిన కె.భరత్ రెడ్డి అనే మరో వ్యక్తి హస్తం ఈ వ్యవహారంలో ఉందని, అతని కోసం గాలిస్తున్నామన్నారు. వీరికి మద్య బాటిళ్ల సరఫరా చేసింది అతనేనని విచారణలో తేలిందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్‌సింగ్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (భీమవరం) ఆర్వీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పుష్ప యాగోత్సవం

వీరవాసరం: మహా శివరాత్రి సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో గురువారం శ్రీ పుష్పయాగోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన వీరవాసరంలో శ్రీ వీరేశ్వర, విశ్వేశ్వర స్వామి ఆలయంలో, రాయకుదురులో ఉమామూలేశ్వర స్వామి ఆలయంలోనూ, తోలేరులో రుద్రేశ్వర స్వామి ఆలయంలో, కొణితివాడలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ఘనంగా పుష్పయాగోత్సవాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాయకుదురులో ఉమామూలేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో అడ్డాల వెంకటేశ్వరరావు, కవురు శ్రీనివాస్ దంపతులు, అడ్డాల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు

ఉండి: లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. గురువారం ఉండిలో పర్యటించిన వేణుబాబు పేదలకు దుప్పట్లు పంపిణీ, సన్‌రైజ్ వృద్ధాశ్రమానికి రూ.10 వేలు ఆర్థిక సాయం, ఉండి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారం కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే ఉండి లయన్స్‌క్లబ్ తన ప్రత్యేకతను చాటుకుందన్నారు. కార్యక్రమంలో ఆర్వీ సూర్యనారాయణరాజు, ఆర్‌సీ కృష్ణమూర్తి, జెడ్‌సీ కృష్ణంరాజు, శివరామరాజు, నరసరాజు, గాదిరాజు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.